TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 255 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.11.04.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## అన్నా.. మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపించాడు - కేసీఆర్ తో భేటీలో జీవన్ రెడ్డి

### ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన జీవన్‌రెడ్డి - కేసీఆర్ కలిసినప్పుడు భావోద్వేగానికి గురైన జీవన్‌రెడ్డి - ఇన్నాళ్లకైనా కేసీఆర్ కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని వెల్లడి



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసం వేదికగా ఈ భేటీ జరిగింది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లుగా నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన తర్వాత తొలిసారిగా కేసీఆర్‌తో భేటీ అయ్యారు. సమావేశంలో జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భేటీ సందర్భంగా భవిష్యత్ కార్యచరణతో పాటు పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. 'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' – జీవన్ రెడ్డి,

సీనియర్ నేతజీవన్రెడ్డిని ఆహ్వానించిన కేసీఆర్ : కాగా జీవన్ రెడ్డిని అనునయిస్తూ, అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్, శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం ఇచ్చి ఆహ్వానించారు. భేటీ సందర్భంగా కేసీఆర్, జీవన్రెడ్డి మధ్య పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లుగా సమాచారం. ఈ కార్యక్రమంలోమాజీ మంత్రులు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలుగ్యాదరి బాలమల్లు,మారెడ్డిశ్రీనివాస్ రెడ్డి,రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులు ...40ఆయుధాల సరెండర్..




హైదరాబాద్, అమృత్ తెలంగాణ: తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోవడం సంచలనంగా మారింది.

తెలంగాణ డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు ఉండగా, బెటాలియన్ డిప్యూటీ కమాండర్ సోది కేశాలు కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. కేశాలు లొంగుబాటును పోలీసులు కీలక పరిణామంగా భావిస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు సుమారు 40 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వీరిలో ఎక్కువ మంది ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ ఖగార్' గడువు ముగిసిన తర్వాత కూంబింగ్ చర్యలు తీవ్రతరం కావడంతో, పలువురు మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందినవారని డీజీపీ వెల్లడించారు. అలాగే లొంగిపోయిన మావోయిస్టులకు మొత్తం రూ.1.93 కోట్లు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రకటించారు.

## ధాన్యం ఉత్పత్తి, కేటాయింపుల వ్యత్యాసాన్ని తగ్గించండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, కేంద్రం కేటాయిస్తున్న ధాన్యం సేకరణకు మధ్య నెలకొన్న వ్యత్యాసాన్ని తగ్గించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం ఆయన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి డిమాండ్లతో కూడిన లేఖ రాశారు. రైతులు నష్టానికి లోనుకాకుండా కాపాడుతూనే, అదనపు నిల్వలను నిర్వహించడంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఎఫ్‌సీఐ ముడి బియ్యం లక్ష్యాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. రబీ సీజన్‌కు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉడికించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 8.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా సరఫరా కావాల్సి ఉందని పేర్కొన్నారు. దీని గడువు ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసిపోయిందని తెలిపారు. తేమ స్థాయి తక్కువగా ఉన్న దానిని ఉడకబెట్టిన బియ్యంగా మార్చేందుకు కేంద్రం అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు కేవలం ఐదు శాతం మాత్రమే సరఫరా చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారనీ, దాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. డిసెంబర్ 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఖరీఫ్, రబీ సీజన్ రెండింటిలోనూ వరి ఉత్పత్తిలో గణనీయంగా పెరిగిందని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందించడం, నష్టానికి అమ్ముకోకుండా నివారించేందుకు వికేంద్రీకృత సేకరణ పథకం కింద భారత ప్రభుత్వం తరపున వరిని సేకరిస్తోందని గుర్తు చేశారు. అయితే, కస్టమ్ మిల్డ్ రైస్, ఉడకబెట్టిన బియ్యం లక్ష్యాలను తగ్గించాలన్న కేంద్ర నిర్ణయంతో తెలంగాణ అదనపు నిల్వలు, నిల్వ ఖర్చులు, మిల్లింగ్ ఖర్చులు, వడ్డీ బాధ్యతలతో సతమతమవుతోందని గుర్తు చేశారు. లక్షలాది మంది రైతులను కాపాడేందుకు సేకరణ కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



ఢిల్లీ : అమృత్ తెలంగాణ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ 'జడ్జెస్ (ఇన్‌క్వైరీ) యాక్ట్, 1968' ప్రకారం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే.

## యమునా నదిలో పడవ బోల్తా..తొమ్మిది మంది మృతి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:ఉత్తరప్రదేశ్‌లోని మథురలో గల బృందావన్ సమీపంలో శుక్రవారం ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. యమునా నదిలోని కేషీఘాట్ వద్ద సుమారు 25 నుంచి 30 మంది భక్తులతో వెళ్తున్న పడవ అకస్మాత్తుగా బోల్తా పడింది. ఈ విషాద ఘటనలో ఇప్పటివరకు తొమ్మిది మంది మరణించగా, మరికొందరు గల్లంతైనట్లు సమాచారం. ప్రమాద సమయంలో నీటిలో మునిగిపోతున్న 14 మందిని రెస్క్యూ టీమ్స్ సురక్షితంగా బయటకు తీశాయి. అయితే, మరో 10 నుంచి 12 మంది వరకు నీటిలో గల్లంతై ఉంటారని అంచనా వేస్తున్నారు. జిల్లా అధికారుల కథనం ప్రకారం.. పంజాబ్ నుంచి వచ్చిన యాత్రికుల బృందం యమునా నదిలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పడవలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటమే కాకుండా.. బృందావన్ వద్ద ఉన్న పాంటూన్ వంతెన సమీపంలో పడవ నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు మరియు విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

## ఆర్టీసీ ఉద్యోగుల సహజ మరణానికి రూ.10 లక్షల బీమా




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సహజ మరణానికీ యూనియన్ బ్యాంక్ ద్వారా రూ. 10 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించటాన్ని టీజీఎస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్‌లో సూపర్ సాలరీ అకౌంట్ ఉన్న సిబ్బందికి ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మరణిస్తేనే రూ 1.15 కోట్లు ప్రమాదబీమా వర్తిస్తున్నదని చెప్పారు. 2024లోనే ఉద్యోగుల సహజ మరణానికి కూడా రూ.15 లక్షలు బీమా సౌకర్యము కల్పించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేసిందన్నారు. ఇటీవల యూనియన్ బ్యాంకులో వేతన ఖాతా ఉన్న సింగరేణి సంస్థ ఉద్యోగుల సహజ మరణానికి రూ 10 లక్షల బీమా సౌకర్యం కల్పించిన దానికి అనుగుణంగా ఆర్టీసీ ఉద్యోగులకు కూడా బీమా సౌకర్యం కల్పించాలని టిఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వినతి పత్రం సమర్పించినట్టు తెలియజేశారు. ఈ బీమా సౌకర్యం ఈనెల ఒకటి నుంచే అమల్లోకి వచ్చినట్టుగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొత్త కార్పొరేషన్లలో 17 శాతం




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కొత్త కార్పొరేషన్లలో 17శాతం, మున్సిపాల్టీల్లో 13శాతం ఇంటి అద్దె భత్యం మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి కోరారు. ఈమేరకు గురువారం రెండవ వేతన సవరణ సంఘం చైర్మెన్ శివశంకర్, సభ్యులు ఏ.రామయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ కార్పొరేషన్లకు, వాటి శివారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 17శాతం, నూతన మున్సిపాల్టీలకు, వాటి శివారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 13 శాతం ఇంటి అద్దె భత్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ 1.07.2023 నాటి ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి తమ సిఫారసులుంటాయని పేర్కొన్నారు. నగరాలు, పట్టణాలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వమే ఇంటి అద్దె భత్యం మంజూరు చేయాలని తమ సిఫారసుల్లో ఉంటుందని తెలిపారు. గత పీఆర్‌సీ జీవో 53 ప్రకారం అర్హత గల నగరాలు, పట్టణాలకు పెంచిన హెచ్‌ఆర్‌ఏ వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి సచివాలయంలో వారు వినతిపత్రం అందజేశారు.

## కొన్ని ఇయు దేశాలకు బియ్యం ఎగుమతులపై నిబంధనల సడలింపు



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: కొన్ని యూరోపియన్ దేశాలకు బియ్యం ఎగుమతులపై నిబంధనలను భారత్ తాత్కాలికంగా సడలించింది. సాధారణంగా తప్పనిసరి అయిన నిపుణుల తనిఖీ ధృవపత్రం లేకుండానే బాస్మతి, బాస్మతియేతర బియ్యాన్ని ఆరు నెలలపాటు ఎగుమతి చేసేందుకు అనుమతించినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఇయు సభ్యదేశాలైన బ్రిటన్, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెన్, నార్వే, స్విట్జర్లాండ్‌లకు మాత్రమే ధృవీకరణ పత్రం తప్పనిసరి అని పేర్కొంది. మిగిలిన అన్ని యూరోపియన్ దేశాలకు ఆరు నెలల పాటు తనిఖీ పత్రం నిబంధనను సడలించినట్లు వెల్లడించింది.

## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ కుమార్ ప్రమాణం

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఈరోజు ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బిహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : స్టేడియంలో ప్రజలతో కలిసి యోగాసనాలు చేసిన కలెక్టర్ రాజర్షి షా





యోగ చేస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మారుతున్న జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, శారీరక, మానసిక సమతుల్యత సాధించేందుకు యోగా అత్యుత్తమ సాధనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక', 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ డే సందర్భంగా 'హెల్త్ వీక్' వేడుకలలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజలు, అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఆరోగ్యం కోసం కలిసికట్టుగా.. విజ్ఞానంతో ముందుకు" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం అరగంట సమయం యోగా లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. జిల్లాను ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యోగా ద్వారా శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి దృష్ట్యా స్విమ్మింగ్ పూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా








అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు, చిన్నారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఈత అభ్యాసం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో నీటి శుభ్రత, ఫిల్టరేషన్ వ్యవస్థ, చేంజింగ్ రూములు, షవర్ సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పూల్‌లోని నీరు నాణ్యంగా ఉండేలా తరచూ శుద్ధి చేయాలని, క్లోరినేషన్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పూల్‌కు వచ్చే క్రీడాకారులు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల కోసం వేర్వేరు సమయాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు తెలిపారు. అలాగే లైఫ్ గార్డులు ఎల్లప్పుడూ విధుల్లో ఉండేలా చూడాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో అధిక సంఖ్యలో ప్రజలు స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించే అవకాశం ఉన్నందున, శుభ్రత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులో ఉంచడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 271వ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచ హోమియోపతి దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానాలైన హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ, యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలోపతి మందుల వల్ల దుష్ప్రభావాలు ఎదుర్కొనే వారికి హోమియోపతి ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని ఆయన వివరించారు. ఈ వైద్యంపై తనకున్న నమ్మకాన్ని పంచుకుంటూ, తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న టిఫా (౧×ఖీూ) స్కాన్, రెగ్యులర్ చెకప్‌లను వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి బాటలు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు.

ప్రభుత్వ దవాఖానాలు, బస్తీ దవాఖానాల ద్వారా అందుతున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను కాపాడుకుందాం : ప్రధానోపాధ్యాయులు ఎండి సయ్యద్



అమృత్ తెలంగాణ న్యూస్ ఏప్రిల్ 10, 2026: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయులు ఎండి సయ్యద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలేరు మండలం మందనపెల్లి మండల ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలు అందిస్తున్నారని తెలిపారు.

గ్రామంలోని ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులు సమాజ అభివృద్ధికి పునాది అని,విద్య ద్వారానే పిల్లల భవిష్యత్తు బలపడుతుందని ఆయన అన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలకు రప్పించి, అందరికీ విద్య అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సిరుమర్తి రేణుక నరసయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రజలు వినియోగించుకోవాలని,పాఠశాల పురోగతికి గ్రామస్థులు భాగస్వాములు కావాలని తెలిపారు. పిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిని ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ, వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన ఆదిలాబాద్ ఆణిముత్యం



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే సైనికుల త్యాగాన్ని తన అక్షరాల్లో అద్భుతంగా ప్రతిబింబించిన ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి కాంబ్లే రిషాంత్ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. కేంద్ర రక్షణ శాఖ నిర్వహించిన ప్రతిష్టాత్మక 'వీరగాథ 5.0' పోటీలలో అతను తన ప్రతిభను చాటుకొని జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటాడు. గాదిగూడ మండలం బుద్ధమహర్ గూడ అనే మారుమూల గ్రామానికి చెందిన రిషాంత్, సైనికుల వీరత్వాన్ని హృదయాన్ని కదిలించేలా కవిత్వంగా ఆవిష్కరించాడు. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో వచ్చిన ఎంట్రీలలో అతని కవితలు ప్రత్యేకంగా నిలిచాయి. అతని ప్రతిభను గుర్తించిన కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి స్వయంగా అభినందిస్తూ ప్రశంసా పత్రంతో పాటు మెడల్‌ను అందజేశారు. జాతీయ స్థాయిలో మెరిసిన రిషాంత్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మారుమూల గ్రామం నుండి వచ్చిన విద్యార్థి జాతీయ వేదికపై గుర్తింపు పొందడం జిల్లాకే గర్వకారణం. రిషాంత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డి ఈ ఓ రాజేశ్వర్, అధికారులు అజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళీ బూడిదైన మొక్కజొన్న..పంటకు నిప్పు పెట్టిన దుండగులు..
## చేతికి వచ్చిన పంట ఖాళీ బూడిద అవ్వడంతో స్పృహ కోల్పోయిన రైతు..



కుంసర లో రైతు లక్ష్మణ్ కు చెందిన మూడు ఎకరాల్లో ఖాళీ బూడిదైన మొక్కజొన్న పంట

నిర్మల్ జిల్లా బైంసా ఏప్రిల్ 10 అమృత్ తెలంగాణ బైంసా మండలంలోని కుంసారా గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ కు చెందిన మూడు ఎకరాలు నిప్పు అంటుకోవడంతో కాళీ బూడిదైన ఘటన బైంసా మండలంలోని కుంసర గ్రామంలో శుక్రవారం జరిగింది పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు కావాలనే దుండగులు రైతు పంటకు నిప్పు పెట్టినట్లు తెలుస్తుంది రైతు లక్ష్మణ్ కు చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మధ్యాహ్నం రెండు గంటలకు సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా పంట పూర్తిగా కాలిపోయిన దృశ్యం కనిపించడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన బలరాం జాదవ్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ గూడిహత్నూర్ మండలం కోల్హారి గ్రామానికి చెందిన అధ్యాత్మిక కీర్తనకార్ కాగ్నే అశ్విని వారం రోజుల క్రితం సీతాగొంధీ శివారులో రోడ్ ఆక్సిడెంట్ లో చనిపోయారని విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేయడం జరిగింది. అదే ఆక్సిడెంట్ లో కాగ్నే వసంత్ కు గాయాలు అవ్వడంతో వారిని కూడా పరామర్శించడం జరిగింది. అలాగే అదే గ్రామానికి చెందిన రాథోడ్ మోహన్ సతీమణి చంద్రకళ ఇటీవల గుండెపోటుతో చనిపోయారు అనే విషయం తెలుసుకొని వారిని కూడా పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియచేయడం జరిగింది

# ఎంపీ ఎమ్మెల్యే తప్పుడు ప్రచారంపై కేసు నమోదు చేయాలి మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఎంపీ ఎమ్మెల్యే విడుదల చేసిన మోసపూరిత మాస్టర్ ప్లాన్ పై తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు, మరో పక్క కేంద్ర విమానయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అదిలాబాద్ ఎయిర్పోర్ట్ ఎలాంటి మాస్టర్ ప్లాన్ రూపుదిద్దడం జరగలేదని పత్రికాముఖంగా తెలిపినప్పటికిని, ముందస్తుగా ఎంపీ ఎమ్మెల్యే మోసపూరిత ప్రకటనలతో ఆదిలాబాద్ ప్రజలను ఎందుకు భయాందోళనకు గురి చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తక్షణం ఎంపీ ఎమ్మెల్యే పై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా డిపిఓ కార్యాలయంలో ఖంజూ మౌనిక ని కలిసి కంప్లైంట్ ను అందజేశారు. తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జోగు రామన్న మాట్లాడుతూ . ఎలాంటి నిజాదరణ లేని డూప్లికేట్ మాస్టర్ ప్లాన్ పత్రికా ముఖంగా 4 నెల 28వతేదీన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎంపీ నగేష్ డూప్లికేట్ మాస్టర్ ప్లాన్ ను రూపొందించి విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.. కేంద్ర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈనెల 17న బృందాలతో సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలపడంతో వీరు చేసిన మోసం బయట పడుతుందన్నారు. ఎమ్మెల్యే మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని అన్నారు. తక్షణం వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.. పట్టణ అధ్యక్షులు అజేయ్, వెనగంటి ప్రకాష్, ఆత్రం వెంకటేష్,అన్నెలా వసంత్,, అశోక్ స్వామి పందిరి బుమన్నా, అనిల్ ధమ్మపాల్, కొండ గణేష్,బట్టు సతీష్,సృజన్, దివిటీ రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలగా గుర్తించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 10, 2026: జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గల చెరువును చిత్తడి నేలగా ప్రకటించేందుకు రాష్ట్రస్థాయిలో జరగనున్న సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య లతో కలిసి రెవెన్యూ, మత్స్య, నీటిపారుదల, వ్యవసాయ, పర్యటక శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్రావుపేట గ్రామంలోని చెరువు 132 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉందని, ఈ చెరువు వలస పక్షులకు ప్రపంచ ప్రసిద్ధి పొందిందని తెలిపారు. వలస పక్షులు ఈ ప్రాంతానికి వచ్చి నివాసాలు ఏర్పరచుకుని ఉండడం వలన గుర్తింపు పొందిందని, వలస పక్షులతో పాటు స్థానిక పక్షులకు ఒక సురక్షిత ఆవాస ప్రాంతాన్ని ఏర్పరిచేందుకు ఈ చెరువును చిత్తడి నేలగా ప్రకటించడానికి గ్రామస్తులు, నీటిపారుదల, రెవెన్యూ, మత్స్య, పర్యాటక శాఖల అధికారులకు ఎలాంటి అభ్యంతరం లేదని, చిత్తడి నేలగా ప్రకటించేందుకు తాము అంగీకరిస్తున్నామని తెలియజేశారని వివరించారు. చిత్తడి నేలగా ప్రకటించినట్లయితే కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయబడతాయని, తద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే సమావేశానికి ముందే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్

అమృత్ తెలంగాణ న్యూస్ ఏప్రిల్ 10, 2026: ప్రజలు అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కంతి మధు సూచించారు. ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమం భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఇలాంటి వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని అన్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే పెద్ద వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్





జగిత్యాల అమృత్ తెలంగాణ ఏప్రిల్ 10: రాయికల్ మండలంలో ఉప్పుమడుగు లోఉప్పుమడుగు లో 4 కోట్ల తో చేపట్టిన కస్తూర్బా పాఠశాల నిర్మాణ పనులను సందర్శించారు, 10 లక్షలతో మహిళా సంఘం భవనానికి,రామాజీ పెట్,జగన్నాథ్ పూర్ గ్రామాల్లో 20 లక్షల చొప్పున గ్రామపంచాయతీ,10 లక్షల చొప్పున మహిళ సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. రామాజీపేట గ్రామంలో సి సి కెమరా లను ప్రారంభించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్రం లో విద్య అభివృద్ధి కి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు..విద్య తోనే సమాజం లో గౌరవం.కస్తూర్బా పాఠశాల కళాశాల పనులు దాదాపు పూర్తి కావచ్చింది.జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నూతనం భవనం తో కళాశాలలో అదనంగా 100 బాలికలకు ఉపయోగం అన్నారు. జగిత్యాల లో మహిళా డిగ్రీ కళాశాల తో విద్యార్థిని లకు చాలా ఉపయోగం. ప్రతిపక్షాల విమర్శలకు అభివృద్ధి పనులతో సమాధానం చెప్తా అన్నారు. రాష్ట్రం లో అభివృద్ధి సంక్షేమ రెండు కళ్లు గా సాగుతున్నాయి. సన్న బియ్యం,200యూనిట్ల ఉచిత కరెంట్,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు ఇలా అనేక పథకాలు అమలు చేయడం జరిగింది.అత్యధిక పల్లె దవాఖాన లు జగిత్యాలకు మంజూరు .. రైతు భరోసా, రుణ మాఫీ తో రైతులకు అండగా ప్రభుత్వం. గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పండగల జరుగుతున్నాయి.రాష్ట్రం లో విద్యా వైద్యం వ్యవసాయం పై ప్రత్యేక శ్రద్ధ.వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాల్లో నీటి వృథా లేకుండా చూడాలి.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో మట్టి ఇసుక సరఫరా లో సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలి. జగిత్యాల నియోజకవర్గానికి అత్యధిక ఇందిరమ్మ ఇళ్లు మంజూరు.అన్ని కుల సంఘాల భవనాలకు నిధుల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు గ్రామ ప్రజలకు ప్రజా పాలన అందించడానికి నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం.జగన్నాద్ పూర్ బ్రిడ్జి నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తా...బ్రిడ్జి నిర్మాణానికి డిల్లీ లో కేంద్ర మంత్రిని సైతం కలవడం జరిగింది.ముఖ్యమంత్రి ,సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి విషయం చెప్పడం జరిగింది.చెక్ డ్యామ్ నిర్మాణం తో జగన్నాద్ పూర్ లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం సజావుగా సాగింది. అన్ని విధాలుగా అండగా ఉంటామని,ప్రభుత్వం తో కలిసి పనిచేసి మరింత అభివృద్ధి చేస్తా అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి డీ ఈ మిలింద్ సర్పంచ్ లు పరాచ శంకర్,రోజా,బెజ్జంకి మోహన్,ఉప సర్పంచ్ మల్లయ్య,సుధీర్ రెడ్డి,గంగాధర్,, ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి ,మండల నాయకులు కోల శ్రీనివాస్ రవీందర్ రావు ఏనుగు మల్లారెడ్డి సంధ్యారాణి సురేందర్ నాయక్ గన్నే రాజిరెడ్డి,శేఖర్ రెడ్డి,తంగేళ్ళ రమేష్,మొకీద్, కొండల్ రెడ్డి,మున్ను,తిరుపతి గౌడ్ ,ముత్తన్న, ఏఈ ప్రసాద్ వార్డు సభ్యులు మండల గ్రామ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లహౌనిర్మాణాలను వేగవంతం చేయాలి : జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 10, 2026: ప్రజా సంక్షేమంలో భాగంగా నిరుపేదల కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమిని మండలం రాంపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులహౌహౌకార్యాచరణలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న పనులలో ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలని, ప్రతి కుటుంబం 100 రోజుల పని పూర్తి చేసుకోవాలని తెలిపారు. కూలీలతో మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి గ్యాస్, విద్యుత్ రాయితీ, రేషన్ కార్డులు, పెన్షన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని రోడ్లలో అవసరమైన చోట 2హౌకల్వర్టుల నిర్మాణంహౌహౌచేయాలని అధికారులకు సూచించారు.హౌమల్లిడి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల ఎత్తు, బరువులను పరిశీలించి, విద్యార్థులకు మంచి ఆహారాన్ని ఇవ్వాలని, గ్రామంలోని బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహార భోజనం, పాలు అందించాలని తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించడం జరిగింది.తదనంతరం భీమిని గ్రామపంచాయతీ సందర్శించి గ్రామంలోని అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రాంపూర్,

ఇతర గ్రామాలకు సంబంధించి కొంతమంది భూ సమస్యలపై చేసిన ఫిర్యాదులు,హౌరికార్డులు పరిశీలించి అట్టి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించిహౌమండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలోహౌహౌమండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, ఎ పి ఓ సత్యప్రసాద్, ఈసీ రాజేంద్రప్రసాద్, మల్లిడి గ్రామ సర్పంచ్ కర్ణ మమత, బిట్టురుపల్లి గ్రామ సర్పంచ్ పి. దశరథ్, భీమిని గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవ్, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు

# గచ్చిబౌలిలో ఘోర రోడ్డు ప్రమాదం : ప్రమాదంలో ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ధ్వంసం




అమృత్ తెలంగాణ న్యూస్ ఏప్రిల్ 10, 2026: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మజీద్ బండ నుండి బొటానికల్ గార్డెన్ కొండాపూర్ కు వెళ్లే దారిలో సైబరాబాద్ ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ను మారుతి సుజుకి బ్రీజా (టీఎస్ 07 జి ఇ 9596) కార్ వేగంగా ఢీకొట్టడంతో పూర్తిగా ధ్వంసం అయిపోయింది. కారు ప్రమాద తీవ్రత చూస్తే కారులో ఉన్న వ్యక్తులకు తీవ్రంగా గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. మద్యం మత్తులో లేదా నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందాని తెలియారాలేదు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రామ పాలన ఆఫీసర్‌పై దాడిని ఖండిస్తున్నాం

అమృత్ తెలంగాణ న్యూస్ ఏప్రిల్ 10, 2026: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ పాలన ఆఫీసర్‌పై జరిగిన దాడిని తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు.శుక్రవారం నాడు నవతెలంగాణ విలేకరితో మాట్లాడుతూ ఏప్రిల్ 8, 2026న గ్రామ పాలన ఆఫీసర్ భూపాల్ విధి నిర్వహణలో భాగంగా భూమి పరిశీలనకు వెళ్లగా,కొంతమంది దుండగులు కళ్లలో కారంపొడి చల్లి దాడికి పాల్పడిన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు.విషయం తెలుసుకున్న వెంటనే అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ మరియు పై అధికారుల సమన్వయంతో నిందితులపై కేసు నమోదు చేయించామని తెలిపారు. ఈ సందర్భంలో మెదక్ జిల్లా కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.


# హీరోయిన్ చెల్లి.. మళ్ళీ హీటెక్కించిందిగా.



నేహా శర్మ చెల్లెలిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఐషా, తన అందం, ఫిట్‌నెస్, ఫ్యాషన్ స్టైల్‌తో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. బాలీవుడ్ ముద్దుగుమ్మ ఐషా శర్మ తన గ్లామర్ డోస్‌తో మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చేసింది. నేహా శర్మ చెల్లెలిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఐషా, తన అందం, ఫిట్‌నెస్, ఫ్యాషన్ స్టైల్‌తో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. మోడలింగ్ రంగం నుంచి వచ్చిన ఆమె, తన గ్లామర్ లుక్‌తో సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్‌లో 'సత్యమేవ జయతే' చిత్రంతో హీరోయిన్‌గా మారిన ఐషా,

# శివ కార్తికేయన్ ఈ రేంజ్ కు వస్తాడనుకోలేదు: రెజీనా

ఎస్ఎంఎస్(శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రెజీనా కస్సాండ్రా మొదటి సినిమాతో మంచి నటనతో అందరినీ ఆకట్టుకుంది ఎస్ఎంఎస్(శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రెజీనా కస్సాండ్రా మొదటి సినిమాతో మంచి నటనతో అందరినీ ఆకట్టుకుంది. అమ్మడు తర్వాత తెలుగులో పలు సినిమాలు చేసినా అవేమీ తనకు స్టార్ డమ్ ను తెచ్చిపెట్టలేకపోయాయి. రెజీనా తెలుగులో ఆఖరిగా కనిపించిన సినిమా నేనే నా. ఆ సినిమా తర్వాత రెజీనా మరో తెలుగు సినిమాలో కనిపించింది లేదు. టాలీవుడ్ లో అవకాశాలు రాకపోవడంతో అమ్మడు కోలీవుడ్‌కు షిఫ్ట్ అయిపోయింది. అక్కడ వరుస అవకాశాలందుకుంటూ బిజీ హీరోయిన్ గా మారిపోయింది రెజీనా. ఇదిలా ఉంటే ప్రస్తుతం రెజీనా అజిత్ తో కలిసి విడాముయార్చిలో స్క్రీన్ షేర్ చేసుకుంది అజిత్ కుమార్, త్రిష హీరో హీరోయిన్లుగా నటించిన విడాముయార్చి సినిమాలో అర్జున్ కీలక పాత్ర పోషించారు. అర్జున్‌కు జోడీగా రెజీనా



కనిపించనున్నట్టు తెలుస్తోంది. మాగిజ్ తిరుమేని దర్శకత్వంలో తెరకెక్కిన విడాముయార్చి ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుండగా ఆ చిత్ర ప్రమోషన్స్ లో రెజీనా చాలా చురుగ్గా పాల్గొంటుంది. ఈ నేపథ్యంలో రెజీనా తాజాగా ఓ ఇంటర్వ్యూలో కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శివ కార్తికేయన్ ఇంత పెద్ద హీరో అవుతాడని తాను అసలు అనుకోలేదని, తాను, శివ కలిసి కేడి బిల్లా కిల్లాడీ రంగా సినిమా చేసినట్టు, ఆ సినిమా రిలీజై 12 ఏళ్లవుతుందని రెజీనా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. శివ కార్తికేయన్ ఆ సినిమా టైమ్ లో ఎలా ఉన్నారో ఇప్పటికీ అలానే ఉన్నారని, ఆయనలో ఎలాంటి మార్పు లేదని, అలాంటప్పుడు ఆయన ఈ స్థాయి హీరో ఎలా అయ్యాడనేది తనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని, సినీ ఇండస్ట్రీలో అదంతా చాలా కష్టమని ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిన శివ కార్తికేయన్ మనిషిగా మాత్రం ఏం మారలేదని ఆయన చాలా గొప్పోడని రెజీనా ఈ సందర్భంగా తెలిపింది.






నభానటేష్ హాట్ ఇన్ పింక్

# డాగ్స్‌తో బోల్డ్ నటి స్నేహం

సందీప్ కిషన్ జోరు చిత్రంలో నటించింది ప్రియా బెనర్జీ. ఈ చిత్రంలో రాశీ ఖన్నా నటనతో పాటు ప్రియా బెనర్జీ వేడెక్కించే గ్లామర్ షో ఆకట్టుకుంటుంది. చిత్రంలో నటించింది ప్రియా బెనర్జీ. ఈ చిత్రంలో రాశీ ఖన్నా నటనతో పాటు ప్రియా బెనర్జీ వేడెక్కించే గ్లామర్ షో ఆకట్టుకుంటుంది. బోల్డ్ అండ్ డస్కీ బ్యూటీగా పేరున్న ప్రియా బెనర్జీ 2013లో చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది. అడవి శేష్ నటించి స్వయంగా దర్శకత్వం వహించిన చిత్రమిది. కృష్ణ విజయ్, నారా రోహిత్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రంలోను ప్రియా బెనర్జీ నటించింది. ప్రియా అందచందాలు, గ్లామర్ డోస్ యూత్‌కి నచ్చినా, ఆ తర్వాత రేర్ గా ఛాన్సులొచ్చాయి. పలు తమిళ హిందీ చిత్రాల్లోను ప్రియా నటించింది. ప్రియా సోషల్ మీడియా ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. ఈ బ్యూటీ డాగ్స్ తో స్నేహంగా ఉంటుంది. అందుకు సంబంధించిన కొన్ని ఫోటోలు వీడియోలను ఇన్ స్టాలో షేర్ చేయగా, అవి వైరల్ గా మారుతున్నాయి. టీజర్ ఎలా ఉందంటే? ప్రేమికుల రోజున పెళ్లి: తాజా సమాచారం మేరకు బ్యూటీ ప్రియా బెనర్జీ పెళ్లి కబురు అందింది. ప్రముఖ నటుడు ప్రతిక్ పాటిల్ బబ్బర్ – ప్రియా బెనర్జీ కొంతకాలంగా డేటింగ్ చేస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం రోజున వివాహం చేసుకోనున్నారు. ఈ పెళ్లికి ఇరు కుటుంబ సభ్యులు, కొద్ది మంది బంధుమిత్రులు మాత్రమే హాజరవుతారు. ఈ వేడుక ముంబై– బాంద్రాలోని ప్రతీక్ ఇంట్లో జరుగుతుందని భావిస్తున్నారు. ప్రతిక్ బబ్బర్ – ప్రియా బెనర్జీ నవంబర్



2023లో నిశ్చితార్థం చేసుకున్నారు. గత సంవత్సరం ప్రేమికులు బాంబే టైమ్స్ నిర్వహించిన వాలెంటైన్స్ స్పెషల్ ఇంటర్వ్యూలో కనిపించారు. ప్రియాతో ప్రతీక్ తొలి చూపులోనే ప్రేమలో పడిపోయానని ఇంటర్వ్యూలో చెప్పాడు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com